తాటి కట్టవలమధ్య బండిబాట సన్నగా ఉంది. అక్కడక్కడ తాటాకులు బండిగూటికి రాచుకుంటూ 'బర్ర్' మని శబ్దం చేస్తున్నాయ్. కట్టవ వెలితిల్లోనుండి దూరంగా పాలెం కనబడుతోంది. పాలెం వెనుక ఆకాశం ఎర్రగా ఉంది. ఎద్దు గంటలు గలగల్లాడించుకుంటూ ఎంత జోరుగా నడచినా మెల్లగానే నడచినట్లుంది, మెయిల్లో ప్రయాణం చేసివచ్చిన రామానికి.

"అదిగో ఆ కనపడే పెంకుటిల్లు చూశావా?" తొట్లో కూర్చున్న సుబ్బారావు కొరడాకర్ర తిరగేసి పాలెంవేపు చూపించాడు. పాలెం మొగదల చిన్న బంగళా కనబడుతోంది. "కామరాజు కట్టించిన ధాన్యం మిల్లు." సుబ్బారావు అన్నాడు. పూర్వం ధాన్యం ఆడించుకోడానికి ఏడుమైళ్ళదూరం పోవలసివచ్చేది. పాలెంకూడ పెద్దదవుతుందన్నమాట.

బండి మాలపల్లి దాటింతర్వాత మలుపు తిరిగింది. అప్పుడే ఆవరించే చీకట్లో తెల్లగా కనబడే మేడను చూపిస్తూ "అదే కామరాజు కట్టించిన మేడ." అన్నాడు సుబ్బారావు. కడుపు చేత్తో పట్టుకొని వచ్చిన కామరాజు ఎంతటివాడయ్యాడు!

"కామరాజుపని మంచి జోరుగా ఉందిలే" ఎద్దునదలిస్తూ అన్నాడు సుబ్బారావు. రామం మేడవంకే చూస్తున్నాడు. ఆమేడ వీధికే అందాన్నిచ్చింది.

బండి మళ్ళీ మలుపుతిరుగుతూ గోడమూలనున్న రాయినెక్కి దబ్బునపడింది. రామం తల గోడకు కొట్టుకుంది. తల తడుముకొని, బద్ధకం విరుచుకుని ఎదరకు చూశాడు. తాటాకిళ్ళమధ్య ఎత్తరుగుల మండువాలోగిలి పర్వతంలా కనబడుతున్నది. అరుగుమీద అమ్మ, అత్తయ్య, కాంతం ఉండాలి. నాన్న కెన్ని పనులో! ఎక్కడుంటాడో.

బండి దిగి లోపలికెళ్ళేసరికి పెద్ద మండువాలో చిన్న లాంతరు మినుకు మినుకుమంటూ కనిపించింది. కొడుకుని దగ్గరగా చూస్తూ "బొత్తిగా అలా గయిపోయావేంరా!" అంది రత్తమ్మ. సుబ్బారావు ప్రక్కని బల్లమీద కూర్చున్నాడు. కాంతం గుమ్మంలో నించుంది. "మాడమ్మా! కాంతం. అన్నయ్యకి నీళ్లు తోడు. లెగు రామూ ఎప్పుడు తిన్నావో." అంది సుబద్రమ్మ.

రామం పట్నంవెళ్ళి సంవత్సరమైంది. ఆరాత్రి అందరిదృష్టి రామంమీదే ఉంది. పట్నం విశేషాలు చెబుతున్నాడు రామం.

తన కొడుకు ఇంత పెద్దచదువు చదువుతున్నందుకు రంగయ్యకెంతో సంతోషం. ఆ వూరికంతా పెద్ద చదువు చదివింది తనకొడుకే. "పరీక్షలయి పోయినియ్యా?" కొడుకు నడిగాడు. అంతకంటె ఎలా పలకరించాలో తెలియలేదు.

"ఊఁ!" అన్నాడు రామం.

"మళ్లీ ఎప్పుడెళ్లాలి?"

"మూడు నెలలవరకూ వెళ్ళక్కర్లేదు."

రంగయ్య కొడుకుతో ఎప్పుడూ ముక్క సరిగా మాట్లాడడు. రామం కూడ అంతే. రంగయ్య వాకిట్లో పడుకుని కొడుకు చెప్పేసంగతులన్నీ వినటంలేనట్టు నటిస్తూ, వింటున్నాడు.

మర్నాడుదయం రామం సుబ్బారావులు మండువాలో మంచం మీద కూర్చుని మాట్లాడుకుంటున్నారు "పెద్ద ఉద్యోగం సంపాదించి మన ఊరికి కొలువ పడేట్టు చూడు." అన్నాడు సుబ్బారావు. ఇప్పుడు మెడ్రాసులో చదువుతున్నాడంటే ఎంత పెద్ద ఉద్యోగం చేయాలి!

సుబ్బారావు అన్నదానికి రామానికి నవ్వొచ్చింది. అప్పుడు ఇంకా రామపాద సాగర్ ప్రాజెక్టు ఇన్వెస్టిగేట్ చేస్తుంటేనే, అది పూర్తయినట్లు, రేపో మాపో కాల వొస్తున్నట్లు చేల ధరలు ఆకాశాన్నంటే

కాయ్. ఒక సంవత్సరానికి ధరలు మళ్లీ మామూలుగా తగ్గిపోయినా, కొలవ వస్తుందన్న నమ్మకం మాత్రం పోలేదు కొందరికి. సుబ్బారావుకూడ అంతే. ఎంత అమాయకత్వం! బయటి సంగతులు ఏం తెలియవు వాడికి. ఒకప్పుడు తనకంటె వాడే తెలివైనవాడు. వీధిబడిలో చదివేటప్పుడు చింతపిక్క మాస్టారు వాణ్ణే పొగిడే వాడెప్పుడూ. తనకి ఒక్క లెక్కకూడ వచ్చేది కాదు. ఇద్దరూ కలిసి వెళ్ళడంవలనా, వాణ్ణి పొగడ్డంవలనా తను తప్పనిసరిగా తిట్లు తినవలసివచ్చేది. నాలుగో క్లాసు అయింతర్వాత నాన్న యిద్దర్నీ జగ్గంపేట పంపుతానంటే అత్తయ్య "వీడికి చదువెందుకన్నయ్యా. ఆచేను కొంతా ఎవరు చూసుకుంటారు?" అంది. దాంతో వాడి చదువాగిపోయింది.

సుబ్బారావు వ్యవసాయంలో ప్రవేశించిన మొదట్లో రంగయ్య "నాకు సాయంగా ఉంటాడు" అనుకున్నాడు. కాని వాడు వ్యవసాయంలో బాగా తీరాడు. ఇప్పుడు తనదీ మామయ్యదీ కలిపి చేయిస్తున్నాడు. రంగయ్య పైనుండి చూడ్డమే. సుబ్బారావు కెప్పుడే పని చేయాలో బాగా తెలుసు.

శ్రీ [illegible]
పేర్రాజు

కాని ఫలానా అప్పుడు ఫలానా పని చేయిస్తాను అని రంగయ్యతో చెబుతాడు. రంగయ్య "ఊఁ!" అని మాత్రం అంటాడు. సుబ్బారావుని అల్లుడిగా చూసుకొని సంతోషించేవాడు.

రామం సుబ్బారావుల మాటలు తరగడం లేదు. లోపల రత్నమ్మ కొడుక్కి కాఫీ కాస్తున్నది. కాంతం సాయం చేస్తోంది. గాజు గ్లాసు, పంచదారడబ్బా పట్టుకొచ్చి పొయ్యిదగ్గర పెట్టింది. అమ్మ కాఫీ వడకడుతుంటే కాంతం అటు అత్తయ్యదగ్గర కెళ్లింది లేకపోతే అన్నయ్యకు కాఫీ పట్టుకెళ్ళాలి. సుబ్బారావు అక్కడే ఉన్నాడు.

సుభద్రమ్మ రంగయ్య చెల్లెలు. ఊళ్ళోనే యిచ్చారు. సుబ్బారావు పుట్టిన మరుసటి సంవత్సరమే సుభద్రమ్మ భర్త పోయాడు. రంగయ్యది మండువాలోగిలి. ఎడారిలాగుంటుంది. చెల్లెల్ని తన యింటికి వచ్చేయమన్నాడు. సుభద్రమ్మ దూరం ఆలోచించి వంట మాత్రం వేరే పెట్టి అన్నగారింట్లోనే ఒకపక్క ఉంటూవచ్చింది, ఈ ఇరవై సంవత్సరాలనుండి. పైకి అంతా ఏక కుటుంబంలానే కనబడుతుంది.

కాంతం అటు అమ్మకూ, ఇటు అత్తయ్యకూ కూడ ఏదో పనిలో అడ్డం పడుతుంటుంది. ఇష్టం లేకపోతే ఎక్కడో కూర్చుని అత్తయ్యగారి వేపున్నానని అమ్మతోను, అమ్మదగ్గరున్నానని అత్తయ్యతోను చెబుతుంది. ఏమైనా అంటే ఫక్కున నవ్వుతుంది. కాంతానికిప్పుడు పధ్నాలుగేళ్లు. అది లక్ష్మిలా ఇటూ అటూ తిరుగుతుంటేనే కడుపు నిండినట్లుంటుంది అమ్మకూ అత్తయ్యకూ.

రత్నమ్మ కాంతాన్ని పిలిచింది. గోడవతలనున్న కాంతానికది వినబడలేదు. ఉల్లిపాయలు ఒలుస్తున్న కాంతంతో ప్రక్కనే ఉన్న సుబద్రమ్మ "చూడమ్మా అమ్మెందో పిలుస్తోంది." అంది. "ఊఁ!" అని మూలిగి కాంతం అమ్మదగ్గరి కెళ్లకుండా ఇటు ఇంట్లోకి వెళ్లింది. సుబ్బారావు పరుపుమీద



"వాకిట్లో ముగ్గు"

—శ్రీ పి. యస్. ప్రకాశరావు, రాజమండ్రి.

మేడమీద మల్లి

పెట్టిన బ్యాటరీలైటు తీసింది. అది వేరుశనగ కాయల కాలంలో నక్కల్ని కాయడానికని మామయ్యకు తెలియకుండా రామంచేత మద్రాసునుండి తెప్పించుకున్నాడు. కాంతం పరుపుమీద బోర్లపడుకుని లైటు వేసి గోడమీదకు చూచింది. అమ్మ మళ్ళీ పిలిచింది. ఎందుకో తనకి బావదగ్గరికెళ్ళడానికి చచ్చేటంత సిగ్గు. తనతో మాట్లాడుతూ బావనిసరించి చెప్ప వలసివస్తే అందరూ "నీ మొగుడు" అంటూ చెబుతారు. ఒళ్లు పులకరించి ఏదో లాగుంటుంది. బావ తనకు కనబడితే అదోలా చూస్తాడు. తనలా చాటునుండి కూడ కాదు!

"కొంతయినా తాగలేను." అంటూ రత్నమ్మవచ్చి "ఇక్కడున్నావంటే! ఇది తాగవే." అందిరామం కనీసం చెంబుడు కాఫీ అయినా తాగలేదని ఇదవుతూ చెంబు అక్కడ పెట్టి వెళ్ళింది. కాంతం లేచి ఒళ్లు విరుచుకుని, పైట సర్దుకుని ఇంకొంచెం పంచదార కలిపి బాగా చల్లారిం తర్వాత రెండు గుక్కల్లో తాగేసి, అన్నం తినడానికని బయటికొచ్చింది.

సుబ్బారావు పొలం వెళ్లాడు. పని ఉన్నా లేకపోయినా, ప్రపంచం మునిగిపోతున్నా పొలం వెళ్ళడం మానడు. అది వ్యసనం వాడికి. రామం ఒక్కడూ అరుగుమీద కూర్చున్నాడు.

"ఇదేంటోయ్! నువ్వెప్పుడు దిగావ్!" సూర్యుడు పడమట ఉదయించినంత ఆశ్చర్యంగా అడిగాడు రాయుడు అరుగుమీద కొచ్చి.

"నిన్న సాయంత్రం." అన్నాడు రామం.

"ఉహూ!" తలపాగ గోడకు చేర్చి, దానికి జేరబడి "పట్నం విసేషాలేంటి?" అన్నాడు రాయుడు. రాయుడు ఎంత పెద్ద రైతయినా చిన్న అంగవస్త్రం, తెల్లటి తలపాగా, చిన్న తుండుగుడ్డ తప్పితే మరోటి ధరించడు.

"ఏంఉన్నయ్ విశేషాలు?"

"అయ్యో! బాగుంది! నాకు తెలిస్తే నిన్నడగట మెందుకూ? ఈయేడు పేసయ్యావా? ఫేలిపోయావా?......నవ్వుతావేం!" గద్దించాడు.

"అబ్బే! ఇంకా తెలియవ్."

"ఇంతా చదివి ఏం ఉజ్జోగం చేస్తావో మరి. పెద్ద కలట్టరుజ్జోగం చెయ్యాలి. ఊ! ఊరుకు పేరు తేవాలి ఏవనుకుంటున్నావో మరి."

"బాబుగా రెప్పుడొచ్చారూ?" అప్పిగాడి గొంతుక వినబడిందో లేదో రాయుడు గబుక్కున వాడివేపుకు తిరిగి, "ఒరేయ్! మా బాగా వచ్చావ్. కరణం ఉన్నాడో లేదో చూసిరారా. అదేదో తేల్చుకోవాలి" అన్నాడు.

"ఏంటండి?"

"అదేరా పూజారోరి మాన్నెంలో బెడ్డిరుస్తూ కొవరాజు గట్టు జరిపేసేడు కాదూ! అదీ! తల్లీ మొగుడు! ఎల్లా." అప్పిగాడు పోయింతర్వాత రామం వేపు తిరిగిఅన్నాడు. "ఈ మద్దిన కొవరాజుగాడు మదించిపోయి ఏడుస్తున్నాడులే. అన్నీ ఆ సత్తియ్యగాణ్ణి నీటికాడ ఓ ఊపు ఊపాడు. సుబ్బన్న చేను పడేసుకుందా మనుకున్నాడు. నన్ను కూడ ...ఓసమ్మ! ఆడికంటె ఎత్తులు తెలుసు నాకు. నా కళ్ళముందెదవ నాతోనే చెలగాటం?"

రాయుడిమాటలు రామానికర్థంకాలేదు. "సుబ్బన్న చేను పడేసుకోవడమేమిటి?"

అన్నాడు.

"ఆ! ఏంలేదు. ఈమధ్ది నేదో అప్పు జేశాడు. చేను ఆడికి తణకా పెట్టాడు. దానికి డావా చేత్తానని కూకున్నాడు. ఉన్నపళాన్ని నాలుగే లెవరిదగ్గిరుంటయ్. మీనాన్నే యిచ్చి తనపేర రాయించుకున్నాడప్పుడు. తింటానికి లేకుండా వచ్చి ఊరిమీదే తిరగబడ్డాడు యెదవ. దుమ్ము తిరగబోడుత్తాను ఏవనుకుంటన్నాడో."

"ఎవరూ? కొవరాజుగాడేనా?" అప్పుడే వచ్చిన రంగయ్య అరుగుమీది స్తంభంమీద చేయివేసుకుని నిలబడి అడిగాడు.

"ఊఁ! ఆడిమాటే."

"ఆడిపని మా తిమ్మిరిగా ఉంది."

"ఊరుకుంటుంటే సరి. ఉండదూ?"

"నడుమంత్రం సిరి ఎలాగయితే అబ్బిందని తెగ మిడిసిపడుతున్నాడు ఊరుకుంటే లాబంలేదు."

"ఊరుకుంటానూ? ఈపాలికా పెదవకి జమత్తానా? ఆ గట్టుమీదే తెగేత్తాను." తలపాగ చేత్తోపట్టుకొని లేచి "పొద్దుకుంకేటప్పటికి జరిపించేయనూ!" అంటూ కొంచెం లావుగా ఉన్న నల్లటి శరీరాన్ని ఈడ్చుకుంటూ పోయాడు రాయుడు.

రామాని కింటిదగ్గర తోచక కరణందగ్గరకెళ్ళి లైబ్రరీ తాళం పుచ్చుకుందామని లేచాడు. కరణం ఇల్లు ఆ వీధి చివర్నే. కరణం అరుగుమీద కూర్చుని సుబ్బన్నతో మాట్లాడుతున్నాడు.

"పిలిచి పిల్లనిస్తానంటే కులం తక్కువన్నాట్ట. అమ్మకానికి పెడితే నాలుగకరాలయినా అమ్మాలి." అన్నాడు కరణం.

సుబ్బన్న కొయ్యబారిపోయాడు. "నాలుగెకరాలే!" అన్నాడు. ఆ మాటలు గొంతుకలోనే ఉండిపోయినయ్. పెదాలు కూడ కదల్లేదు. ఉన్న పుట్టెడు భూమిలో నాలుగెకరా లమ్మితే ఇంకేం మిగులుతుంది? మిగతా వాళ్ళ పనేంగాను? నలుగురిలో తలెత్తుకోడం ఎలా? ఒక్క పెద్దకూతురి పెళ్లికే ఇంత ఖర్చా!

"జాగ్రత్తగా చేసుకుంటే నీకిదెంత? నాలుగేళ్ళలో కొట్టి పారేయగలవు."

"ఎలా తీరద్దండి, ఏడాది కైదొందలు పాయిదా పెరుగుతుంటే? నాకొంప గుండమైపోయింది" కర్రచివర్నిగడ్డం ఆన్చి, కర్ర నేలని ఆనినచోట చూస్తూ అన్నాడు సుబ్బన్న. కళ్లంట నీళ్ళు తిరువాయి. ఇంకా మాట్లాడితే గట్టిగా ఏడవాల్సిన పరిస్థితి వచ్చేలాగుంది. కుర్రాడు చదువుకున్నాడని చెప్పి అందరూ తనకొంప తీశారు. "ఉజ్జోగం చేసుకుంటాడు, పిల్ల సుఖపడుతుంది." అన్నారు. పెళ్ళికి వచ్చిన వాళ్లంతా తనని పొగిడారు, ఇంతకట్నం ఇచ్చి పెళ్ళిచేస్తున్నందుకు. మంచి సంబంధం తెచ్చాడట. అన్నీ నిజమే అనుకుని సంతోషించాడు తను.

"మాట్లాడవేం? ఏదయినా ఆలోచించి చేయడం మంచిది. పరుగెత్తి పాలుతాగే కంటే నిలబడి నీళ్లుతాగడం మేలు. నేను చెప్పానని కాదుగాని నువ్వూ ఆలోచించి చూడు." అని హెచ్చరించాడు కరణం.

"చేతులు కాలింతరవాత ఆకులు పట్టుకుని ఉపయోగం ఏంటి లెండి. అంతా అయిపోయింది. అప్పుడారేలు నిలవుంటే- చెప్పుకుంటే సిగ్గు - చేనుకొందామనుకున్నాను. అసలు దానికప్పుడే పెళ్లిచేద్దా



బర్మా-షెల్...
భారత జీవితంలో
ఐక్యమైయున్నది

మేడమీద మల్లి

ఆ

కునుకోలేదు. 'నిక్షేపంలాంటి సంబంధం చేసెయ్' అన్నారు."

"ఏం జేస్తాం, ఎలా జరగాలని ఉందో అలా జరగాల్సిందే."

"అంతే లెండి" అంటూ సుబ్బన్న తలెత్తేటప్పటికి ఎదురుగా రామం కనిపించాడు. "నువ్వెప్పుడొచ్చావురా" అన్నాడు.

"నిన్న సాయంత్రం. సత్యం ఏం చేస్తున్నాడు?" సత్యం సుబ్బన్న అల్లుడు.

"ఏమో నాకేం చెప్పడు. ఒకళ్లు చెప్పినట్టు వినడట." కరణంవంక చూస్తూ "వస్తానండి" అని పోయాడు సుబ్బన్న.

"చిరాగ్గా ఉన్నాడేం?" కరణంవంక చూచాడు రామం.

కరణం పోయే సుబ్బన్నవంక చూస్తూ "పాపం దుక్కలాగుండేవాడెలాగయిపోయాడో చూశావా?" అన్నాడు.

"జబ్బు పడ్డాడా?"

"అంతకంటె ఎక్కువే. అప్పుల బెంగ. మూడు పువ్వులూ ఆరు కాయలుగా ఉండే సంసారమూ" దీర్ఘం తీస్తున్నాడు కరణం వైరాగిలా.

"అప్పులా!"

"ఇప్పుడేం! పెద్ద కూతురి పెళ్లిదగ్గర్నుండీ అప్పులే. వడ్డీకి వడ్డీ పెరిగింది. చదువుకున్నాడని మురిసి బోలెడు కట్నం ఇచ్చి జోరుగా చేశాడు పెళ్లి."

కరణం చెబుతుంటే రామం స్తంభానికి జేరబడి వింటున్నాడు. సుబ్బన్న సమస్య వాణ్ణి దెయ్యంలా పట్టుకుంది. సుబ్బన్న మొన్నటివరకు మోతుబరి రైతు. ఇప్పుడు అప్పులు పెరిగినయ్యట. ఎవరి నోట్లో చూచినా సుబ్బన్నే. ఎంత లోకువైపోయాడు! కళ్లు మూసుకుని, వెనకా ముందూ



ఆలోచించకుండా, తాహతుకు మించి ఎవరు ఖర్చుపెట్టమన్నారు? మిగిలిన యిద్దరు కూతుళ్లకు పెళ్ళిచేయక్కర్లేదనుకున్నాడా! కొడుక్కి రాగిచిప్ప యిద్దామనుకున్నాడా?

"అల్లుడు యఫ్. ఏ. పేసయ్యాడా! ఏదో ఉద్యోగం చేసుకోకూడదూ! పెద్దది కావాలంటాడట. కట్నం సొమ్ముతో మోటారు సైకిలు కొని నాలుగురోజులు తిప్పి సగాని కమ్మాడట. కట్నం అంతా ఇలాగే తగలబెట్టాడు. ఇంతా అంతా కాదు, ఆరు వేలు. ఇక్కడ సుబ్బన్న పెట్టుబడికి డబ్బు లేక, అప్పులు పుట్టక కుమిలిపోతున్నాడు." అభినయంతో చెబుతున్నాడు కరణం.

ఇది ఇంకో వేలంవెర్రి అయిపోయింది. చదువుకున్నాడంటే చాలు మానవాతీతుడి క్రింద పరిగణించడం, దమ్మిడీ ఆస్తి లేకపోయినా వేలు కుమ్మరించడం. ఇంతా చేస్తే వాడు బ్రతికేది ఈ కట్నంమీదే. వీలయితే పూర్తిగా మామగారి మీద భారం వేస్తాడు. ఈరోజుల్లో గుమాస్తాగా సంపాదించిన 70 రూపాయలు పట్నంలో ఏమూలకొస్తయ్? అందరూ గెజెటెడ్ ఆఫీసర్లు కాగలరా? వీళ్ళకంటె ఉన్న యకరం దున్నుకుంటూ పోయిగా, చీకూ చింతా లేకుండా స్వతంత్రంగా బ్రతికేవాడు నయం కాదూ?

"అప్పుకోసం చేను అమ్మేస్తానంటాడు."

"ఎవరేం జేస్తారులెండి. కావలసిందే అలాగ." తనమీద భారం ఉన్నట్లు మాట్లాడుతున్నాడు రామం.

"బాగా చెప్పావ్—సరే గాని ఇలా గొచ్చావెందుకు? ఎండలో!"

"అబ్బే లైబ్రరీతాళం కోసమని."

"దాన్నొను వ్వరగనివి ఏమున్నయ్. లైబ్రరీ కామేశ్వరం మాస్టారితో వచ్చింది. ఆయనతోనే పోయినట్టుంది. నీలాంటివాళ్లు మళ్ళీ పూనుకోవాలి."

తను నిజంగా పుస్తకాలున్నయ్ చదువుదామని రాలేదు. లైబ్రరీలోని పుస్తకాలన్నీ చెదపురుగులు చదువుతున్నయ్యని తనకీ తెలుసు. ఏం ఊసుపోక వచ్చాడంతే. తాళం తీసికోకుండానే పోయాడు రామం.

పట్నంగోల కలవాటుపడిన రామానికి పదిరోజులవరకూ పల్లె వాతావరణం హాయి అనిపించింది. ఈ పదిరోజులూ రామానికి పదిగంటలుగా గడిచిపోయినయ్.

రత్తమ్మ తమ్ముడు సూర్యనారాయణ వచ్చాడు కాకినాడనించి. నారాయణకు కాకినాడ తాలూకా ఆఫీసులో గుమాస్తా పని. రావడం పెద్ద పనిమీద వచ్చాడు. కాంతానికి సంబంధం తీసికొచ్చాడు. రంగయ్య, నారాయణ, రత్తమ్మ ఆ వేళ రాత్రి ఒంటిగంటవరకూ కూర్చుని మాట్లాడుకున్నారు. అప్పటివరకూ తను తెచ్చిన సంబంధం గురించే చెప్పాడు నారాయణ. పెళ్ళికొడుకు తండ్రి తాశీల్దారు. ఇంకా ఎన్నో. ఆఖరు మాటగా "బి. ఏ. చదువుతున్నాడు. ఇది కాస్తా అయింతర్వాత బళ్ళతో తెచ్చి పడేస్తాడు. చేనుంటే ఎంత, లేకపోతే ఎంత?" అన్నాడు.

రంగయ్య మెత్తబడ్డాడు. అసలు సుబ్బన్న కూతురి పెళ్లిలోనే తట్టింది రంగయ్యకు కాంతాన్నికూడ చదువుకున్న

సర్ జీవన్ శిలాజిత్ లేహ్యము

శిలాజిత్ హిమాలయా పర్వతమునుంచి తీసి చైతన్యమిచ్చు అపూర్వ మూలికలనుంచి తయారుచేసిన లేహ్యము. వాయువు, వాతము, పుష్ఠము, పిత్తము వీటన్నిటికిని గుణము నిచ్చు లేహ్యము. విద్యార్థులకు జ్ఞాపకశక్తియు హెచ్చును. శిశువులకు దేహపుష్టి కలుగచేయును. స్త్రీలకు కలుగునటువంటి సర్వ వ్యాధులను నివారించును.

44 దినములకు డబ్బా 1 కి రు 5-4-0. 22 దినములకు డబ్బా 1 కి రు 3-4-0, పోస్టేజి ఉచితము.

నీలగిరి డిపో, 151, బియ్యంపేట చౌక్ - బెంగుళూరు సిటీ.

అప్పటమైన నీలగిరి తైలమును నీలగిరి డిపోయందు అడగండి.

జోడి కిచ్చిచేయాలని. సుబ్బన్నకంటె వారుగా చెయ్యాలనుకున్నాడు. సుబ్బన్నంటే తనముందు ఎంత? పెళ్లిమంటపం ముందు కూర్చుని కలలుగన్నాడు. కాని సుబ్బారావు జ్ఞాపకం రావడంతో నే ముల్లు గుచ్చుకున్నట్లయింది. చిన్నప్పటినుండీ వాడికివ్వాలని అనుకుంటున్నారు. అప్పుడే కంగారెందుకులే అనుకున్నాడు. ఇప్పుడు మళ్ళీ నారాయణ దాన్ని రేపాడు. కాంతం చాల అందంగా ఉంటుంది. దాన్ని తప్పకుండా చదువుకున్నవాడికే ఇచ్చి చెయ్యాలి. ఫలానా రంగయ్య అల్లుడు ఇనస్పెక్టరు అంటే తనకి కాదూ! "సరే చూద్దాంలే" అన్నాడు రంగయ్య.

ఇక రత్తమ్మసంగతి చెప్పనక్కర్లేదు. తన యిష్టంకాదు, చెప్పినా లాభంలేదని ఊరుకుందిగాని, ఎప్పుడో అనుకుంది. అప్పుడు రాజమండ్రి ఆస్పత్రికి వెళ్లినపుడు సుబ్బన్న అల్లుడింట్లోనే మకాం. సత్యవతి ఎంత వరసగా కాపురం చేస్తోంది! పూర్తిగా మాటతీరు అదీ అంతా మారిపోయింది. ఇల్లు ఎంత అందంగా ఉంది! గుమ్మాలకి తెరలు, ఎలక్ట్రిదీపాలు, ఎలక్ట్రీతో పాటే పెట్టె - అసలు ఉద్యోగస్థుల ఇళ్ళే అలాగుంటయ్. కాంతానికికూడ అలాంటి సంబంధం రావడం, భర్త ఒప్పుకోడం, రత్తమ్మ ఆనందానికి మేరలేదు. ముహూర్తం వెంటనే పెట్టేసుకుంటే బాగుండుననుకుంది. ఎందుకంటె సుభద్రమ్మ మాటలు విని మొగుడు మళ్ళీ మారిపోవచ్చు. ఇంటికొచ్చిన ప్రతివారికీ చెప్పింది ఈ సంగతి.

నాలుగురోజులు గడిచాయి. "అయితే రత్తమ్మొదినీ మన కాంతానికి సంబంధం కుదిరినట్టే?" సుభద్రమ్మ దగ్గరనుండి సరాసరిని దొడ్డి తిరిగొచ్చింది సావిత్రమ్మ. సుభద్రమ్మ అమాయకత్వం ఎంత పని చేస్తుందో విప్పిచెప్పింది. "కర్రలేనివాణ్ణి గొర్రి కరిచిందట. ఎంత మెత్తనిదానివే" అని వచ్చింది.

"ఔనొదినీ కుదిరినట్టే. కాకినాడట. ఏదో పెద్దచదువే చదువుతున్నాడట; మాయది నాకు గేపకం ఉండదు. గౌరవమైన కుటుంబం. ఇంతకీ పిల్ల అదృష్టంలే." అంది రత్తమ్మ. ఈ విషయం ఎవరెవరికి చెప్పిందో ఎవరెవరికి చెప్పాలో జ్ఞాపకం ఉండడం లేదు రత్తమ్మకు. ఎందుకైనా మంచిదని అనుమానమొస్తే అంతా చెబుతుంది.

"మరి సుబ్బారావుకు చేసుకుంటాం అన్నారు కాదూ. సుభద్రమ్మ ఊరుకుందా?"

"తెలకడుగుతానూ, ఊరుకోక ఏం జేస్తుంది? ఎవరికి తగ్గ సంబంధం వారికొస్తుంది. అల్లరి పెట్టడం ఎందుకుచెప్పు!"



"అది కాదు చిన్నప్పటినించీ..."

"వంద అనుకుంటాం అన్నీ జరుగుతయ్యా? మాటవరసకి; ఈడికీ అతనికీ సాటెక్కడా?" సుబ్బారావుని కాబోయే అల్లుడితో పోల్చింది.

ఒక్కసారిగా అన్నగారిలా మారిపోయినందుకు సుభద్రమ్మకు కష్టం కలిగింది. తన కొడుక్కి ఆస్తి తక్కువ ఉండడం వల్లనే రంగయ్య అలా తిరిగి పోయాడనుకుంది. రంగయ్యకు అసలు పిత్రార్జితమే ఎక్కువ. దానిమీద ఇంకో అంత గడించాడు. ఇప్పటివరకూ సుభద్రమ్మ తన ఆస్తి, అన్నగారి ఆస్తి అని వేరు వేరేమాడ లేదు. అంతా ఒకటే అనుకుంది. రంగయ్యకేం, ఒక్కర్తే కూతురు. బోలెడు కట్నం ఇవ్వగలడు. కొడుకు పెద్ద చదువులు చదువుతున్నాడు. కొండంత కట్నం వస్తుంది. తన కొడుక్కేముంది. అంతా పోగుచేస్తే ఆ రెకరాలు అంతే.

ఏదో తగిన సంబంధం రాకపోదుగాని తనకొడుకుని బీదవాడినిగా చూచి తేలిగ్గా తీసేయడం సహించలేకపోయింది సుభద్రమ్మ. అదీగాక వాడింకా చిన్నవాడు. ఒంటరిగాడు. మేనమామే ఇలా చేస్తే వాడందరికీ లోకువైపోతాడేమోనని ఆమె భయం. ఎన్ని విధాల ప్రయత్నించాలో అన్నివిధాల ప్రయత్నించింది. బ్రతిమాలింది. "నీకిది తప్పదన్నయ్యా. నువ్వే ఇలాగ చేస్తే వాడందరికీలోకువైపోతాడు." అంది. ఏడ్చింది. "చిన్నప్పటి నుండి కడుపులో పెట్టుకుని పెంచి ఇప్పుడిలాగ చేస్తావనుకోలేదు. ఆ మారాజుపోయినప్పుడు కూడ నాకింత కష్టం కలగలెదు." అంది.

బెదిరించింది. "ఈ పెళ్ళే నువ్వు చేసుకుంటే నేను నీగడప తొక్కను. నేను రాకుండా ఎలాగ చేసుకుంటావో చేసుకో." అంది.

నలుగురిచేతా చెప్పించింది. "నిక్షేపంలాంటి కుర్రాడు. వాడికేం తక్కువ? వాడికే ఇస్తే- నీకంటె తెలివైన వాడు" అన్నారు. అన్నిటికీ రంగయ్య చిన్నగా నవ్వి ఊరుకున్నాడు.

సుభద్రమ్మ రంగయ్య ఇంటి కెళ్ళడం లేదు. రంగయ్య చలించలేదు.

"సుబ్బారావు లేడమ్మా" చెంచయ్య వచ్చాడు.

"ఎందు కన్నయ్యా? ఇప్పుడే అన్నం తిని చేలో కెళ్ళాడు" అంది సుభద్రమ్మ. ఆమె గొంతుక మారిపోయింది. మాట గొంతుకలోనే ఉండిపోతుంది.

"ఎందుకమ్మా అంత యిదవుతావ్? దగ్గరనేగాని, ఆ మాత్రం సంబంధం రాకపోదు" అన్నాడు చెంచయ్య, సుభద్రమ్మ ముఖంలోకి చూస్తూ.

"గీత అలా గుందనుకోవాలి అంతే"

"పోనీ. మాశావూ కామరాజు కూతుర్ని చూశావా? దాన్ని చేసుకుంటేనో?" దిక్కులుమాస్తున్నాడు చెంచయ్య.

కొరడాదెబ్బల్లా తగిలాయి ఈ మాటలు సుభద్రమ్మకు. "ఈ మాట నువ్వే అంటున్నావా? ఎవరయినా అడగమన్నారా?" అంది సుభద్రమ్మ.

చెంచయ్య ఉక్కిరి బిక్కిరయ్యాడు. "అబ్బే! ఏం లేదు. చేలో కెళ్ళాడా?" అంటూ వెనక్కి చూడకుండా పోయాడు. సుభద్రమ్మ కుమిలికుమిలి ఏడ్చింది. తన వాళ్లంతా కూర్చునేచోటికి కూడ కామరాజుకు రావడానికర్హత లేదు. కామరాజు ఆ వూరికి పదిహేను సంవత్సరాల క్రితం కడుపు చేత్తో పట్టుకునివచ్చి, చేలు పాలికి చేసుకుని బాగా గడించాడు. ఎక్కడినుండి వచ్చాడో, అతని కుటుంబం ఎటువంటిదో ఎవరికీ సరిగా తెలియదు.

రామాని కప్పుడే పల్లెటూరివాతావరణం మొహం మొత్తింది. అమాయకత్వంలో

కావలెను

ఫిలిము కంపెనీకి

కొత్త తారలకు, ఇతర ఆర్టిస్టులకు గ్యారంటీగా అవకాశం లభించును. ఫిలిము, మరియు రికార్డుటెస్టులకు మీరు రు 20/-లు పంపగలిగిన వెంటనే మాకు వ్రాయండి. లేకున్న వ్రాయవద్దు.

Maharaja Film Company,

12 th Road. Khar. Bombay-21.

మేడమీద మట్టి

ఆనందం ఉంది. కాని అందులోనే సర్వనాశనం చేసే యాటంబాంబులు కూడ పుడుతుంటయ్ అప్పుడప్పుడు.

రాముం అరుగుమీద కూర్చున్నాడు. రాయుడు వచ్చి రాముం దగ్గర కూర్చున్నాడు. "మాటాడకుండా అలా కూకుంటావేం? ఏదోటి చెప్పాలిగాని. మొన్న కరణంగారింటి కొచ్చి నబ్బాయిని కదిపి ఒదిలేస్తే గడగడగడ వాగేసేడు" అన్నాడు.

"అంత యిదిగా ఉంటే ఓసారి రాగూడదూ పట్నం, అంతా చూద్దువుగాని. ఎంత ఉన్నా చేనుకోనాలనే."

"నేనేం కొన్నానోయ్. ఆమాట కొస్తే మా నాన్నే రాయించుకుంటున్నాడు, సుబ్బన్న చేను, ఎకరం పదకొండొందలు చేసి."

"పదకొండొందలా?"

"ఊఁ! ఏం? మా నాన్నకి పోటీ ఎవ రొత్తారు?"

"అబ్బో! అదే మంచిదయితే నువ్వూరుకుంటావా?"

రాముం అన్నమాట రాయుడికి బాగానే ఉన్నట్టు తోచింది. చేనేమో బంగారంలాంటిది. పండకపోవడం ఉండదు. ముందు నీరందుతుంది. ఏక చెక్క. తను ఇంకో యాభై అంటే రంగయ్య తన పీక తీస్తాడా? ఎవడో కొంటున్నాడని తనూరుకోవడమేమిటి?

"మాట్లాడవేం? ఏమిటాలోచిస్తున్నావ్?"

"ఉండవా, వత్తాను. నీకేం తెగ బలిసి మాట్లాడుతున్నావ్." అంటూ తలపాగ విడిచిపెట్టి పోబోయాడు రాయుడు. "తలపాగ వద్దా," అన్నాడు రాముం.

ఆరోజు సాయంకాలమే రంగయ్య రుసరుసలాడుతున్నాడు. చెంచయ్యతో రాయుడి దగ్గరకు కబురంపాడు. చెంచయ్య రంగయ్యకు కుడిభుజం. చెంచయ్యకు పశువులిచ్చి, పెట్టుబడికి అప్పు ఇచ్చి సాయం చేస్తుంటాడు రంగయ్య.

"సుబ్బన్న చేను రంగయ్య కొంటాడట మామా" అన్నాడు చెంచయ్య రాయుడితో.

"కానుకోక్క మర్రా! ఇదేం సిఫారసు? ఎవ రెక్కువంటే ఆడికే ఇత్తాడు."

ఆ మాటే చెంచయ్య రంగయ్యతో చెప్పాడు. తోక తొక్కిన త్రాచులా లేచాడు రంగయ్య. "ఓహో! అయితే నేనేం గాజులు తొడిగించుకోలేదు. అదీ చూద్దాం. వీడి దెప్పుడూ యెదవ బుద్దే యెదవ బుద్దంట." తుప్పుక్కున ఊశాడు.

సుబ్బన్న చేనుగురించి పోటీ పడుతున్నట్లు మర్నాడే ఊరంతా పాకింది. చెరువు గట్టుమీద పాకలో కూర్చున్నవారందరూ ఎవరికి తోచినట్లు వారంటున్నారు. ఈ విషయం తప్ప మాట్లాడుకోడానికి వేరే సంగతు లేమీ లేవు వాళ్ళకి. "లేకపోతే బంగారంలాంటి చేను పదకొండొందలకి పడేసుకుందా మనుకున్నాడు కాబోలు." అన్నాడు కోటయ్య నడిచెక్కలు చీరుతూ. రంగయ్యంటే కోటయ్యకు కోపం. అతనూ చెంచయ్యా కరణం చేనుగురించి పేచీ పడుతుంటే, రంగయ్య చెంచయ్య కిప్పించాడు.

"అయినా రంగయ్య కుదుర్చుకున్న చేనుకు రాయుడు పోటీపడ్డం ఎందుకు?" నార పినిపెడుతూ అన్నాడు వెంకన్న. వెంకన్న కూడ చెప్పుకోదగ్గ రైతే. రాయుడు పోటీకి రాకపోతే తనుగూడ ప్రయత్నం చేద్దామనుకున్నాడు, చవకగా వస్తుందని.

"మంచి పోటీ పడిందిలే. సుబ్బన్న అదృష్టం. రెండేలదాకా రావచ్చు" నార తడప వెంకన్న కందిస్తూ అన్నాడు సత్తియ్య.

రంగయ్య, రాయుడు ఊరికి పెద్ద రైతులు. సమాన ఉజ్జీ. ఇద్దరిమధ్య పడిన పోటీతో ఊళ్ళోవాళ్ళకి బాగా కాలక్షేపం అవుతోంది. ఏమౌతుందో అని అందరికీ ఆత్రుతగా ఉంది.

కాని ఈ కాలక్షేపం చూస్తుండగానే ఇంద్రజాలమై కూర్చుంది. చేను ధర మూడు వేల రెండొందలకు పెరిగింది. ఎవరికీ ఖాయపడలేదు. తొలకరివాన కురిసింది. రంగయ్య, రాయుడూ ఇద్దరూ సుబ్బన్న చేలో విత్తనాలు జల్లడానికి తయారయ్యారు. చూస్తూ ఊరుకుందామనుకున్న వారంతా రంగయ్య, రాయుడు అనే అయస్కాంతపు ముక్కలకు ఇనుపరజనులా అంటుకుపోతున్నారు. కొందరి కిది స్వంతగొడవై పోయింది.

రంగయ్యతరపున చెంచయ్యఉంటే రాయుడి తరపున కోటయ్య ఉన్నాడు. రంగయ్య పదిమందితో వెడితే రాయుడు పదిహేనుమందితో వచ్చాడు. "నీ కెంత కావలిస్తే అంతా యిత్తాను. చేను నాదని

"చెప్పు." అన్నాడు రాయుడు సుబ్బన్నతో. రంగయ్యకూడా అదే ముక్క అన్నాడు. ఆ చేనుమీద రాయుడికెంత హక్కుందో రంగయ్యకూ అంతే ఉంది. అప్పటివరకూ మధ్యవర్తుల ద్వారా మాట్లాడుకునే రంగయ్య, రాయుడు ముఖాముఖిని తిట్టుకోడం మొదలెట్టారు. "నీదంతా కుళ్ళు" అన్నాడు రంగయ్య. "నీదంతా టక్కరితనం. దురాశ" అన్నాడు రాయుడు. "చేలోకి దిగావంటే నరుకుతా" అన్నాడు రంగయ్య. "మెళ్ళిరిసేత్తాను ఏమనుకుంటన్నావో" అన్నాడు రాయుడు.

రాయుడు రంగయ్య లిలా తిట్టుకుంటుండగా, సుబ్బారావు వేడిరక్తం రాయుడి దాపటెద్దుని గట్టిగా కొట్టించడంతో అసలు కథ ప్రారంభమైంది. రాయుడి అరక ఆ దెబ్బతో మడిఅవతలకు పోయింది. చెంచయ్య నిర్భయంగా స్వంత గొడవలా కర్రెత్తాడు. "ఊరనుకున్నావా అడివనుకున్నావా?" అంటూ కోటయ్య దిగాడు. ఇటు పదికర్రలు అటు పదికర్రలు ఖణఖణమోగాయి. ఎవరూ చావకముందే విడిపోయారు. గట్టుమీద రాయుడి గొంతుక పోయింది. ఇంకా పంచె ఎగ్గడుతూనే ఉన్నాడు.

ఊరంతా అట్టుడికినట్లుడికిపోయింది. పల్లపువీధిలోనుంచి నలుగుర్ని తీసికొచ్చి కోటయ్య రాయుడింట్లో మీటింగు పెట్టి మాట్లాడాడు.

"కలబడ్డారు ఏం ధైర్యమో చూడు." అన్నాడు ఒకడు.

"ఏంటో మరి ఆళ్ల ఉద్దేశం? ఈళ్ళంత చేతకాని వాళ్ళనా?" ఇంకొకడికి అనుమానం వచ్చింది.

"ఇంతదాకా వచ్చింతర్వాత ఊరుకోగూడదు మామా. కొట్టి పట్టుకెల్తారా? ఊరుకుంటే ఎంత లోకువా?" అన్నాడు కోటయ్య.

"అవున్రా. అదేటో నేనూ మాత్తాను. బలవంతాన్ని రాయించుకుంటాడా? ఏఁవన్నా అవసరం పడితే—ఎంత డబ్బయినా సరే పాలెంవోళ్లు మన తరఫున ఉండేలాగ మాడు కోటయ్యా" అన్నాడు రాయుడు.

పల్లపు వీధంతా రాయుడి తరఫు నుంటే మెరక వీధంతా రంగయ్య తరఫున ఉంది. "కాఁవరాజును కట్టేసేవంటే, కొత్తూరంతా కాఁవరాజు చెప్పినట్టు వింటుంది." చెంచయ్య రంగయ్యకు సలహా చెప్పాడు. అవును నిజమే. కాఁవరాజంటే గురి కొత్తూర్లోవాళ్ళకి.

రాత్రి తొమ్మిది గంటలకు పల్లపువీధి చుట్టు తిరిగి రంగయ్య కామరాజింటికెళ్ళాడు. "అబ్బే పాలికాపుదగ్గర కెళ్ళి వస్తూ ఇలాగొచ్చాను. ఇవాళ జరిగినసంగతి విన్నావా?" అన్నాడు రంగయ్య. రంగయ్య పనిగట్టుకుని తనదగ్గరకు వచ్చి చెప్పడం కామరాజుకు సంతోషమయింది. తను ఎంత డబ్బు సంపాదించినా ఊళ్ళో గౌరవం మాత్రం సంపాదించలేక పోతున్నాడు. తను బీదవాడుగా ఉన్నప్పుడెలా చూచేవారో ఇప్పుడూ అలాగే చూస్తున్నారు. అనవసరంగా మొన్న గట్టు దగ్గర రాయుడి ముందు బుర్ర వంచుకోవలసివచ్చింది. ఇప్పుడు రంగయ్యకు రాయుడికీ పడింది. రాయుడికి బుద్ధి చెప్పాలంటే ఇదే సమయం. "ఊరుకున్నావేంటి నాన్నా. నీకున్నంతమంది వెనుక నాకుంటే అక్కడే కింద పడేసి తొక్కేవాణ్ణి. ఈసారి మళ్ళీ..."

"అసలందుకే వచ్చిందిలే. అందర్నీ కూడదీస్తున్నాడట. అదీ చూద్దాం అని వచ్చాను."

కామరాజు ఇంత త్వరగా తనపక్షం చేరతాడని అనుకోలేదు రంగయ్య. ఈసారి రాయుడు దెబ్బలాటకే వస్తాడో, ఏం చేస్తాడో చూస్తాను, అనుకున్నాడు రంగయ్య.

రంగయ్య కామరాజులు రాత్రి పన్నెండు గంటలవరకూ మాట్లాడుకు



న్నారు. "అమ్మాయి పెళ్లి కుదిరిందట నిజమే?" కామరాజు అడిగాడు. కొంతం పెళ్లి కాకినాడలో కుదిరితే, సుబ్బారావుకు తన కూతుర్ని ఇవ్వాలని ఉంది కామరాజుకు. రంగయ్యతో సంబంధం కలుపుకుంటే గౌరవం దానంతటదే వస్తుంది. ఎలాగయినా ఈ సంబంధం చేయాలి.

"ఆఁ! కుదిరినట్టే" అన్నాడు రంగయ్య.

"మరి సుబ్బారావు పెళ్లిప్పుడు చెయ్యవూ?"

"చెయ్యాలనే ఉంది, ఏదో సంబంధం చూసి."

'ఏంలేదు. మా అమ్మాయి నివ్వాలనిఉంది. నీకు తెలియందేముంది? కట్నం నువ్వడిగినంత!" అన్నాడు కామరాజు, కొంచెం ముందుకు వంగి రంగయ్య ముఖంలోకి చూస్తూ. రంగయ్య కొంతసేపటివరకూ మాట్లాడలేదు. "దాంతోకూడ మాటాడాలి కదూ. చెప్తాను" అన్నాడు.

తాడు తెగి పోనీయకూడదు, అనుకున్నాడు కామరాజు. తర్వాత ఒక్క మాట కూడ మాట్లాడుకోలేదు వాళ్ళు.

కామరాజు రంగయ్యతరఫున చేరాడు అని తెలియడంతోనే రాయుడు "ఈడూ ఓ మనిషే! ఆ యెదవ అంప చేరాడంట, సీమూ నెత్తురు లేని మనిషి. ఛీ."అన్నాడు.

ఇదంతా జరిగిన నాలుగోనాడు ఊరికి పడమర బ్రహ్మాండమైన కాంతికనబడింది. అందరూ పరుగెత్తారు. రంగయ్య చేలో రెండువందల రూపాయలు చేసే గడ్డిమేటు నిలిచి కాల్తోంది. ఎగబడి ఆర్పడం మొదలెట్టారు. మేటు ఆర్పడానికి ఎవరెవరు రాలేదో చూడమని కొంతమందిని నియమించాడు రంగయ్య. రాని వాళ్ళంతా తన శత్రువులు.

రంగయ్యమేటు తగలబడ్డం రాయుడికి భయాన్నే కలిగించింది. అది తను తగలబెట్టించలేదు. ఆ పని తను చేయించేడని అనుమానంతో అవతల రంగయ్య పరవళ్లు తొక్కుతున్నాడు. తనకేం తెలియదని చెప్పినా ఈ పరిస్థితులలో ఎవరూ నమ్మరు. రంగయ్య ఊరుకోడు. అంచేత ముందే జాగ్రత్తపడాలి.

రాయుడు తనగడ్డిమేటు దగ్గర కొత్తగా కాపలా వేయడం, రంగయ్య గడ్డిమేటు కాలిపోయిన సంగతి తనకి తెలియనట్లు మసలుకోవడం చూచేసరికి, ఆ పని రాయుడు చేయించినట్లు అందరికీ అర్థమైపోయింది.

"ఎంతపని చేయించాడు!" అన్నాడు

(53-వ పేజీ చూడండి)

మేడమీద ముట్టి

(15-వ పేజీ తరువాయి)

కామరాజు నిట్టూరుస్తూ రంగయ్యతో. ఓ గంటసేపు రంగయ్యతో రహస్యంగా మాట్లాడేడు. రంగయ్య కోపంతో వణికి పోతున్నాడు. రాయుణ్ని కాలితో నేలని పెట్టి రాచేయాలని చూస్తున్నాడు. ఊళ్లో మెరకవీధి కొత్తూరు తన తరఫున ఉన్నా నిర్భయంగా రాయుడింత పనిచేయించాడు. ఇంకేం చెప్పాలి ? ఉఁహూ !

"అంతే ఆపనే చేయించాలి. తర్వాత ఏం జరిగినా సరే." అన్నాడు కామరాజు. "అంతే" అన్నాడు రంగయ్య.

పదిగంటలైంది. భయంకరంగా ఉంది చీకటి. కామరాజు ఇంటికి పోతున్నాడు రంగయ్య వద్దనుంచి. అతనికి అన్నీ అనుకూలిస్తున్నయ్. గడ్డిమేటు తగలబెట్టించింది రాయుడని అందరూ నమ్మేసేరు. అందుకేగా అసలు తను ఆపని చేయించింది! రంగయ్యకు రాయుడెంత దూరమైతే, తను అంత దగ్గరపడతాడు. రాయుడు ఎంత అడుక్కిపోతే తను అంత పైకి వస్తాడు. అంతా అనుకూలిస్తుంది. ఇంక తన కూతుర్ని రంగయ్య మేనల్లుడికిస్తే...

మరో మూడురోజులు గడిచాయి. ఈ సారి ఊరికి ఉత్తరం వైపున మంట కనబడింది. రాయుడిపాక కాలిపోయింది. పాలికాపు తాటిచెట్టుకు విరిచి కట్టబడి ఉన్నాడు. తెంపుకుపోయినవి పోగా ఒక ఎద్దు, రెండు గేదెలు వికృతంగా పొట్టలు పగిలి చచ్చిపడిఉన్నయ్. "ఎవరో పాతేత్తాను" అన్నాడు రాయుడు కాలిపోయిన పాకదగ్గర నిలబడి.

"నామేటు తగలెట్టించినవాడి రక్తం తాగుతాను." అన్నాడు రంగయ్య, ఇంటి అరుగుమీద నిలబడి.

అందరూ రాయుడిపాక ఆర్పడానికీ, చచ్చిన పశువుల్ని చూడ్డానికీ వెళ్లారు. ఇంతలో పల్లపువీధిలో కోటయ్య ఇంటికి నిప్పంటుకుంది. అందరూ పరుగెత్తుకొచ్చే సరికి నాలుగిళ్ల వరకూ పాకిపోయింది మంట. చెరువులో నీరు అడుగంటి ఉంది. ఆర్పడం బ్రహ్మాండమైపోయింది. వీలయినంతవరకూ మంటలు కొత్తూరు, మెరకవీధి వెళ్ళకుండా ఆపుచేశాడు రంగయ్య.

ఊరంతా పీచుపీచు మంటూంది. ఎప్పుడే ఉపద్రవం ముంచుకొస్తుందో అని ఎదురు చూస్తోంది. మెరకవీధి కాకి పల్లపువీధికి రాదు. పల్లపువీధి కాకి మెరకవీధికి రావడానికి వీల్లేదు. పల్లపువీధిలో కమ్మర్లు మెరకవీధిలో వాళ్ళపనులు చేయరు. మెరకవీధివారి చాకళ్ళు పల్లపువీధివారి బట్టలుతకరు.

చెరువుగట్టుమీద రావిచెట్టుకింద పాకలోకి చెత్త చేరింది. రాయుడి దొడ్లో చింతచెట్టుకిందను, రంగయ్య ఇంటి అరుగుమీదను జనం కూడుతున్నారు.

రష్యన్లు జర్మనీ నాశనం చేస్తుంటే హిట్లరు పని ఎలాగుందో రంగయ్య పని అలాగుంది. ఊళ్లో పార్టీ గొడవలు ముమ్మరంగా ఉన్నయ్. ఇంట్లో కాంతం పెళ్లి గురించి గొడవ. సుబ్రదమ్మ ఇల్లు ఖాళీ చేసి స్వంతయింటికి పోడానికి ప్రయత్ని

స్తోంది. ఆమె కేదో నచ్చజెప్పి సముదాయించడానికి కూడ తీరిక లేదు రంగయ్యకు.

అత్తయ్య స్వంతయింటికి పోయేగ్గాజున కాంతం పడుకుని లేవలేదు. బయటికి రాలేదు. మంచం దిగడానికే భయమేసింది. అత్తయ్య నాన్నతో దెబ్బలాడి ఇటు రావడం మా నేసిన దగ్గర్నుండి కాంతం అటు పోలేదు. అలా వెళ్ళవద్దని ఎవరూ శాసించలేరు గాని ఆమెకు మాత్రం శాసించినట్టే ఉంది. సుబ్బారావునిగురించి తను ఊహించిన ఊహాలన్నీ జ్ఞాపకం తెచ్చుకుంది. అత్తయ్య తనని ఎలా పిలిచేదో తనలో తనే అనుకుంది. ఆ వేళంతా కాంతం లేవలేదు. "అదేమే?" అంది రత్తమ్మ.

"ఏం లేదు" అంది కాంతం.

అత్తయ్య పోయేటప్పుడు ఏదో తీసుకుపోయింది. అందరూ కలసి కాంతం పసి హృదయాన్ని పిండేస్తున్నారు.

కాంతాన్ని చూసుకోడానికని నారాయణతో నలుగురు మగాళ్ళు మాత్రం వచ్చారు. "ఇదేం చిత్రంరా! మగాళ్ళకెలా చూపించమంటావ్? మన్లో ఎక్కడైనా ఉందా ఇలాగ?" అంది రత్తమ్మ నోటిమీద చేయి వేసుకుని.

"ఇప్పుడు చదువుకున్నవాళ్ళంతా ఇంతే. మనం కాలాన్ని బట్టి నడముకోవాలి. అయినా పెళ్లి చేసుకునేది పెళ్ళి కొడుకా? ఆడాళ్ళా?" నారాయణ అక్కను మళ్ళీ మాట్లాడనీయలేదు.

కాంతం ఇంట్లో వంటరిగా ఉండగా రామం వెళ్లి "నీకు బావని చేసుకోడం ఇష్టం లేదా?" అని అడిగాడు. కాంతం నిర్ఘాంతపోయింది. ఏమనాలో తెలియలేదు. తన యిష్ట మేముంది? ఇలా అడుగుతాడని తెలిసి ఉంటే ఆలోచించుకునేదేమో. "మాట్లాడవేం చెప్పు" అంటూ రామం దగ్గరకొచ్చాడు. కాంతం కళ్ళల్లో నీళ్లు కనబడ్డాయి తన చర్య తనకే అసహ్యమనిపించింది. మూర్ఖురాలైపోతూ డేం తను?

బలిపీఠంమీద కెక్కించే మేకలాగు, కాంతానికి, బెనారసు చీర కట్టి నగలన్నీ పెట్టింది రత్తమ్మ. పెళ్లివారు ముందువాల్లో కూర్చున్నారు. కాంతం వెళ్ళనని మొరాయించింది. రత్తమ్మ తలుపుచాటునుండి తోసింది. అక్కడ ఆడాళ్లున్నారో మగాళ్లున్నారో కూడా మూడలేదు కాంతం. ఆ కాస్తసేపు అగ్గిమీద నిలబడ్డట్టు నిలబడి బయటికొచ్చిం తర్వాత అమ్మని కౌగలించుకుని బావురుమంది.

"ఏమంటావోయ్?" నారాయణ రామాన్ని అడిగాడు

"అవును. ఇప్పుడైతే బి. ఏ. చదువుతున్నానని చెప్పుకోవచ్చు. తర్వాతయితే ఉద్యోగం దొరకలేదనో, గుమాస్తా ఉద్యోగమనో చెబితే ఇప్పుడొచ్చినంత కట్నం రాకపోవచ్చు." రామం చెప్పింది నారాయణకు అర్థం కాలేదు. నోరు తెరిచి చూస్తున్నాడు. "ఈ పెళ్ళి చెయ్యరని చెప్పు" అన్నాడు మళ్లీ.

"ఇది నిజము...

... మీరు లక్స్ టాయిలెట్ సబ్బుతో

ఇంకా మనోహరముగానుండవచ్చును"

అని సుశీల

చెప్పుచున్నది



నిజముగా ఫలకరమైన నియమము తప్పని సౌందర్య పద్ధతి ఇదిగో! "సువాసనతో, దాన్న మీగడవంటి లక్స్ టాయిలెట్ సబ్బు నురగను నేను నా చర్మము మీద బాగా రుద్దుతాను. తరువాత నేను కడుగుకొని ఒక మెత్తటి తువ్వాలుతో అద్దుకొనగానే నా చర్మము ఒక క్రొత్త అందమును తెచ్చుకొనును." అని సుశీల చెప్పుచున్నది.

లక్స
టాయిలెట్ సబ్బు

సినీమా తారలకు
సౌందర్యమునిచ్చు సబ్బు

LTS. 367-X30 TL

వెండిమీద మట్టి

"అదేంట్రా!" అంది రత్తమ్మ.

"ఎందుకురా?" మెల్లగా తీక్షణంగా అడిగాడు రంగయ్య.

"ఏంలేదు. జరగకూడదు. అంతే." ఎన్నో కారణాలు చెప్పాలనుకున్న రామానికి ఉద్రేకంలో నోరు తిరగలేదు. సుబ్బారావు కిచ్చి చేయాలని వాడి ఉద్దేశం.

"విడిశావులే. బయల్దేరాడు పెద్ద." గదమాయించాడు రంగయ్య. అంతా నిశ్శబ్దంగా ఉన్నారు. రంగయ్య బయటికి పోయాడు.

రంగయ్యకు చిరాకెక్కువయింది. ఏం చేయడానికి తోచడంలేదు. తను తప్పుదారిని నడుస్తున్నట్టనిపిస్తోంది. ఇంతనుందని కాదని తను ఈ పెళ్లి చేయడమేనా? దాని ముట్టుకది ఏడుస్తూంది. ఇల్లు వదలిపోయింది. ఇవతల ఈ చేను గొడవ అలాగే ఉంది. తనలాగే రాయుడు కూడ ఆకు పెంచుతున్నాడట, సుబ్బన్న చేలో ఊడ్చడానికని. మళ్లీ ఏపాక తగులబెట్టిస్తాడో! అయిన ఎనిమిది వందలరూపాయల ఎడ్లజత కనబడకుండా పోయింది. వెధవ ఏం చేయించాడో! ఎవడిచేతయినా శుభ్రంగా రాయుడిని చంపించేస్తే బాగుండేటట్లుంది. వాడు బ్రతికుంటే తనకు విశ్రాంతి అంటూ ఉండదు. ఎలా చంపించాలి? రాయుడి బుర్రతీసేయడం తన వల్లవుతుందా?

"నీ చేను మంచి పనిచేస్తోందే!" వెటకారానికన్నా భరించలేకపోతున్నాడు సుబ్బన్న. ఎక్కడచూచినా "సుబ్బన్న చేను" అన్నమాటే వినబడుతోంది. పాలెం ఊరే "సుబ్బన్న చేను" "సుబ్బన్న చేను" అంటూ కూర్చుంది. అప్పులు పెరిగి తను విడుస్తుంటే ఇదొకటి పై పెచ్చు. కరణాన్ని కలిసికొని ఎంతకో అంతకి ఎవరికో ఒకరికి ఖాయం చేయమన్నాడు. 'సరే' అన్నాడు కరణం.

కాంతానికి జ్వరంగా ఉంది. రంగయ్య మంగలి నూకాలుకు కబురంపాడు. నూకాలు వచ్చి నాడిచూచి "పరవాలేదు బాబయ్యా, కొంచెం ఉష్ణంచేసిందంతే" అని మాత్రయిచ్చిపోయాడు. రత్తమ్మకి కొంచెం కంగారుగా ఉంది. "శుభమా అని పెళ్ళి తలపెడితే ఇదేవిటే" అంది. కూతురి తల నిమురుతూ "ఎలాగుందమ్మా!" అంది. ఎలాగుంది? ఏంబాధ? "ఎలాగూ లేదు" అంది కాంతం.

రామం వచ్చి "వాళ్ళకి ఉత్తరం రాసేశాను" అన్నాడు అమ్మతో. ఈ మధ్య అమ్మతో దెబ్బలాడుతున్నాడు రామం, ఈ పెళ్ళిచేయకూడదని.

"నాతో చెబుతావెందుకురా? మీ నాన్నతో చెప్పు."

"అక్కర్లేదు. నాన్నతో ఎందుకు? నువ్వొప్పుకుంటే నాన్న ఒప్పుకున్నట్టే" అంటూ గబగబాపోయాడు రామం.

రత్తమ్మ కాంతంవేపు తిరిగి "అలా మాస్తావెందుకే? ఎలాగుందో చెప్పమంటే చెప్పవేమమ్మా" అంటూ బుజ్జగించింది. కాంతం కళ్ళంట నీళ్లు తిరిగినయ్. "అదేంవిటే?" నీళ్ళు తుడవబోయింది. కాంతం తల్లి వడిలో తలపెట్టుకుని పొర్లుతూ ఏడ్చింది. "కొంపతీసి గాలా ఏమిటి? పడుకో వస్తాను." అని రత్తమ్మ కాంతానికి దుప్పటి కప్పింది.

రంగయ్య కొడుకు మీద ఎగురుతున్నాడు, తన యిష్టం లేకుండా వాళ్లకి ఉత్తరం రాసినందుకు. కొడుకు ఆవిధంగా రాస్తున్నాడని రంగయ్యకూ తెలుసు. ఏమనడానికి తోచక అప్పుడు ఊరుకున్నాడు. అయిపోయింతర్వాత తిరగబడ్డాడు. ఎంత తెలిసినా తన అధికారానికి లోపం వచ్చినట్లు కనబడింది. దాన్ని గురించి తనూ ఆలోచిస్తున్నాడు. తనే అలా రాయమని చెప్పేవాడేమో. రాసే ముందు తనకి ఎందుకు చెప్పలేదు?

"యెదవ తెలివితేటలు సంపాదించావు ఎలాగయితేనేం" అన్నాడు కొడుకుని. "ఉత్తరానికంటె ముందుపోయి నారాయణతో చెప్పు అసలు వాళ్ళతో చెప్పవద్దని. ఫో." అరిచాడు రంగయ్య.

అంతకుముందే వచ్చి నిలుచున్న రత్తమ్మ "ఆచార్లుగారింటిదగ్గర్నుండి కొంచెం యీబూది తెప్పించండి. ఉత్తినే ఉలికిపడుతోంది" అంది.

"చావండి ఎలాగోలాగ" గబగబా బయటికి వెళ్లాడు రంగయ్య.

"బాబుగోరూ! కరణంగోరు రమ్మంటన్రు." కరణందగ్గర్నుండి కబురు. ఈ మధ్య ఇద్దర్నీ చెరిసగం ఏదో ధరకట్టుకు తీసికోమని రాయబారాలు జరుగుతున్నయ్. అందుకే అయిఉంటుంది. "ఊఁ! పద" అని బయలుదేరాడు. "సగం గిగం కుదరదు" లోపలే అనుకున్నాడు. కోపంతో అడుగులు జోరుగా వేస్తున్నాడు.

"ఎంతకైతే పుచ్చుకుంటావో ఒక్కమాటచెప్పు రంగయ్యా. రాయుడికంటె ఎక్కువంటే నీదే." అన్నాడు కరణం.

"ఆడేంతన్నాడు?"

"రాయుడినింకా అడగలేదు. అడిగినా ఎలా చెబుతాను? ఇద్దర్నీ అడుగుతాను. ఎవరెక్కువంటే వారిదే. ఏం చెంచయ్యా?" రంగయ్య ఇంటిదగ్గర్నుండే వచ్చాడు చెంచయ్య అప్పుడే.

"ఉహూఁ! అయితే నాకా చేనే వద్దు." గిరుక్కున తిరిగాడు రంగయ్య. చెంచయ్య రంగయ్యతోబాటు జోరుగా నడుస్తూ "మాంచి పనిచేశావు మామా. అంత దరకైతే దండుగే." అన్నాడు.

కరణం రంగయ్యని ఎంత ఇంటికి పిలిపించి అడిగినా ఈ సంగతి రాయుడికి తెలియక పోలేదు. రంగయ్య ఎందుకు వద్దన్నాడా అని ఆలోచించాడు రాయుడు. అసలావార్త నిజమా కాదా అన్నాడు. "కరణం ఇంట్లో పనిచేసే గొల్లది చెప్తేనే" అన్నాడు కోటయ్య. అయిదేళ్ళ కుర్రాళ్లు కూడ ఈ విషయాలు శ్రద్ధగా వింటున్నారు. పెద్దాళ్ళతో చెబుతున్నారు.

కరణం ఈసారి రాయుడికోసం కబురంపకుండా తనే వెళ్లాడు. "అనవసరంగా పోటీ ఎందుకు రాయుడూ. ఇంత ఇస్తానని చెప్పు. నీ పేర రాయించేస్తాను." అన్నాడు.

"నాకు ఎంతకైనా సరే వద్దండి." వెంటనే అనేశాడు రాయుడు. కరణానికిదంతా కలలా తోచింది. వెర్రిగా చూస్తూ గుటకేశాడు. నోట్లో తడి ఆరిపోయి గుటక పడలేదు.

పెళ్ళివిషయంలో కామరాజు రంగయ్యను మళ్ళీ కదిపాడు. రంగయ్య కేం చెప్పాలో తెలియలేదు. "ఏదీ? మనం ఈ గొడవలో పడిఉన్నాం. అది కోపగించిపోయింది. ఇంకా మాట్లాడలేదు" అన్నాడు. ఈ పెళ్ళి తప్పకుండా జరుగుతుందని కామరాజుకు నమ్మకం ఉంది. జరిగేలా చేయగలడు. చేస్తాడుకూడ.

ఇనాం! ఇనాం!!
అమూల్యమగు మీ జీవితము సౌఖ్యవంతముగా నుంచుటకు సమీప మార్గమును చూపు పుస్తకము—
దాంపత్య వికాసము
మదనమంజరి ఫార్మసీ,
184, మైనాబజారురోడ్డు, మదరాసు.

అ~ఉడికేవరకు పొయ్యి ఆరిపేయడదు. ఆరిపోతుంటే ఇంకో పుల్ల పెట్టాలి. రంగయ్యా ఎడ్లజత ఎలా పోయిందో తనకి తెలియకపోయినా, తన రొట్టె నేతిలోకే దొర్లింది. పూజారోరి మాన్యం రంగయ్యా రాయించుకున్నాడు కదా! పది సంవత్సరాలనుండి శిస్తు లేకుండా అది రాయుడు చేస్తున్నాడు. పన్ను కూడ రాయుడే కడుతున్నాడు. ఇప్పుడు చేను కూడ నాదే అంటున్నాడు. రంగయ్యాచేత కాగితం రాయించి కోర్టులో పడేస్తే కనీసం అయిదు సంవత్సరాలవరకు పొయ్యి మండుతుంది. ఈలోపున అన్నం ఉడకదూ?

రాయుడి దొడ్లో చింతచెట్టు కింద మీటింగు జరుగుతోంది. "పాపం! అబ్బాయి బాగా ఎక్కించి అంట గలుపుదా మనుకున్నాడు కాబోలు!" ఈసడించాడు రాయుడు.

"దాని మాటకేం గాని, పూజారోరి మాన్యం గురించి దావా పడేత్తాడంట" అన్నాడు కోటయ్యా.

"పడేయనియ్. అదీ చూద్దాంగా."

కోటయ్యా బావమరది గబగబ నడచి వచ్చి "సుబ్బన్న చేను కొమరాజు కొనేసేడట" అన్నాడు వగర్చుకుంటూ.

"ఎవరన్నారు?"

"ఎవరో అనేదేంటి? రాంకో వెలమీద కూర్చునికరణం అగ్రిమెంటు రాస్తుంటేను" అన్నాడు.

"ఎంతకి?" కోటయ్యాడిగాడు.

"ఎకరం సంచి రూపాయలంట."

"ఆఁ!" రాయుడు బుర్ర పైకెత్తాడు.

"అద్దలాగుండాలి యవ్వారమంటే." అన్నాడొకడు, కొమరాజు వ్యవహార జ్ఞానాన్ని పొగడుతూ. రాయుడు వాడి వంక ఓసారి చూచాడు.

ఈ విషయం గురించి రంగయ్యా ఏమను కున్నా పైకి మాత్రం "బలే పని చేశావ్" అన్నాడు.

"ఊడ్చడానికి ఆకు చాలదేమో. తలవని తలంపుగా వచ్చింది. నీదగ్గరేమయినా..." కొమరాజు మాట పూర్తి చేయక ముందే రంగయ్యా "అలాగేలే" అని గబగబ నడుచుకుంటూ ఇంటి కెళ్ళాడు. వాకిట్లో మంచం మీద కూర్చున్నాడు. చీకటి పడుతోంది. కాంతాన్ని పిలిచి నీళ్లు తీసుకురమ్మన్నాడు.

కాంతం నీళ్ళు తీసుకరాలేదు. దానికి జ్వరం తగ్గింది. కాని పూర్వంలా ఉండటం లేదు. కూర్చున్న చోటే కూర్చుంటుంది. మాట వినిపించుకోదు. పరధ్యానం ఎక్కువైంది. ఎవరూ లేనప్పుడు సుబ్బమ్మగారుండే వేపుకు వెళ్లి ఇటూ అటూ తిరిగి వస్తుంటుంది.

రామం పట్నం ప్రయాణం కట్టాడు. నాన్న తనతో మాట్లాడ్డం లేదు; అమ్మయినా అవసరమైతే నే. ఊళ్లో వందగొడవలు. ప్రతిదానికీ పట్టుదలే. పూజారి మాన్యం గురించి నాన్న దావా వేస్తాడట. ఆ చిక్కుల్లో ఉన్న చేనురాయించుకోడం ఎందుకని చెప్పేవారు లేకపోయారు. సంబంధం కలుపుకోడానికని కొమరాజు చూస్తున్నాడు. నాన్నని ఊరుకోనివ్వడు. నాన్నకి అసలే కోపం. ఏం చేస్తాడో? ఎక్కు దొరక లేదు. వెదకడాని కెంత ఖర్చవుతుందో?

"అప్పుడే ఎందుకురా?" అంది రత్తమ్మ.

"మళ్ళీ దసరాకు వస్తాను" అన్నాడు. అత్తయ్యతో చెప్పడానికని బయలుదేరాడు. అత్తయ్యా ఇల్లు మారి ఇంచుమించు నెలకావస్తున్నా ఒక్కసారికూడ వెళ్ళలేదు. శరీరం బరువుగా కదుల్తోంది. కళ్ళు దిక్కులు చూస్తున్నయ్.

అత్తయ్యను చూడ్డంతోనే చేతుల్తో ముఖం కప్పుకుని మంచంమీద కూలబడి, తల మోకాళ్ళమీద ఆన్చి ఏడవడం మొదలెట్టాడు. "రోజులు అలాగున్నయ్యంటే నాయనా" అంటూ రామం చేతులు పట్టుకుని వారించబోయింది. చేతులు వణికినయ్. చెంగుతో తనముఖం కప్పుకుంది.

"ముఖం కడిగేసుకో." సుబ్బారావు చెంబుతో నీళ్ళు తెచ్చి దగ్గర పెడుతుంటే, వాడి ముఖంలోకి చూచాడు రామం. మామూలుగానే ఉంది. తెలియకా? ధైర్యమా? అత్తయ్యా ఏదో అంది. "మళ్లీ దసరాకువస్తా"అన్నాడు.

రంగయ్యా మూడువందలు లెక్కపెట్టి తీసి పందిరి మంచం పరుపు మీద పెట్టి బయటికి వచ్చాడు. రామం వెళ్లి అవి జేబులో వేసుకున్నాడు. సుబ్బారావు బండికట్టి వీథిలో నిలబెట్టాడు. వీథిలోకి వస్తూ అరుగుమీద నున్న రంగయ్యతో "దసరాకొస్తాను." అన్నాడు. "ఊఁ!" అన్నాడు రంగయ్యా.

బండి నడుస్తోంది. మనస్సు వెనక్కి లాగుతోంది. ఇంకా ఇరవైరోజులుండగా అప్పుడే ఎందుకు బయలుదేరానా అనుకున్నాడు. ఓ డజను కార్డులమీద తన యడ్రసు వ్రాసి సుబ్బారావు కిస్తూ "ఊళ్లో ఏం జరిగినా రాస్తావుకదూ" అన్నాడు. అది తీసుకునేటప్పుడు సుబ్బారావు చేతిమీద ఒక కన్నీటిచుక్క రాలింది.

"ఇంకా కుర్రాడివా? ఎందుకదీ అసలు?"

తొట్లోంచి కొంచెం వెనక్కి జరిగాడు సుబ్బారావు. పన్నెండుగంటలయింది. ఎండ తీక్షణంగా కాస్తోంది. ఎడ్లు వగర్చుకుంటూ నడుస్తున్నయ్. సుబ్బారావు చేతులు పట్టుకుని జలజల కన్నీరు కార్చాడు రామం. ★

రచయితలకు మనవి

మాకు కథలు, గేయాలు, చిత్రాలు, ఫొటోలు పంపేవారు వానిని త్రిప్పి పంపగోరినట్లయితే, రచనలూ చిత్రాలతోపాటు అవసరమైన స్టాంపులను గాని, స్టాంపులు అంటించి చిరునామా వ్రాసిన కవర్లను గాని చేర్చి పంపవలసిందని మనవి. స్టాంపులను పంపేవారికి మాత్రమే వారి రచనలను గాని, చిత్రాలను గాని ప్రచురించే ముందు ప్రచురణ విషయమై తెలియ పరచగలము. ఈ సందర్భంలో రచయితలు, చిత్రకారులు మాకు సహకార మివ్వగలరని ఆశిస్తున్నాము.

---

3 సువాసన కళారత్నములు

ఘుం ఘుం జవాద్
అగరువత్తులలో మిక్కిలి శ్రేష్ఠమైనవి.

ఘుం పాలు
క్రిమిసంహారిణిగా ఉపయోగించు పరిశుద్ధ గంధపుపొడి

ఘుం అగర్
పూజాదులకు ఉపయోగించు శ్రేష్ఠమైన అగరువత్తులు.

డియస్. సుగంధాలయ, వాసన ద్రవ్య వ్యాపారులు,
బెంగుళూరు 2